సాక్షి అనకాపల్లి

శనివారం : 17 ఆగస్టు 2024



వృక్షాబంధన్

విశాఖ: చిల్డ్రన్స్ మూమెంట్ ఫర్ క్లైమేట్ జస్టిస్ సంస్థ నేతృత్వంలో శుక్రవారం సీతమ్మధారలో వృక్షాలకు రాఖీ కట్టారు.



మళ్లీ సహస్రనామార్చన

సింహాచలం: సింహగిరిపై స్వామివారి మూలవిరాట్‌కు కరోనా నాటి నుంచి నిలిచిపోయిన సహస్రనామార్చన పూజను పునరుద్ధరించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఆగస్టు 17న 3 మి.మీ, 18న 6, 19న 6, 20న 3, 21న 5 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

చేర్చుకున్నారు.. ఛీ కొట్టారు



మీ దారి మీ ఇష్టం...!

- పార్టీ మారిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు కూటమి ఝలక్
- ప్రలోభాలతో పార్టీ మారిన కొందరు స్థానిక నేతలు
- ఎమ్మెల్సీ ఏకగ్రీవంతో ఇప్పుడు పట్టించుకోని వైనం
- స్థానిక నేతలు అంగీకరించడం లేదంటూ మెలిక
- డబ్బు ఇస్తామని ఆశ చూపి... ఇప్పుడు పట్టించుకోని దుస్థితి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఏరు దాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా తయారైంది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న నేతల పరిస్థితి. మొదట్లో డబ్బు, పదవి, పనుల ప్రలోభాలతో పార్టీలో చేర్చుకుని... తీరా పార్టీ మారిన తర్వాత కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు అచ్చం ఇలాగే ఉందని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉందామని భావించి భారీగా ప్రలోభాలకు దిగిన కూటమి నేతలు.. ఇప్పుడు ఏకగ్రీవంతో చేతులెత్తేశారు. పార్టీ మారిన నేతలకు... స్థానికంగా తమ నాయకులు అంగీకరించడం లేదని కూటమి పెద్దలు కొర్రీలు పెడుతున్నారు. ఇస్తామన్న డబ్బు ఇవ్వకపోవడంతోపాటు పార్టీ పదవులు కూడా ఇవ్వలేమని తేల్చిచెబుతున్నారు.

ఇక మీ దారి మీ ఇష్టమంటూ కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ మారి భారీగా దండుకుందామని ఉవ్విళ్లూరిన స్థానిక నేతలకు గట్టి దెబ్బే తగిలింది. తమకు సీటిచ్చి... గెలిపించిన పార్టీని కాదని ఆశతో పార్టీ మారిన నేతలకు కొత్త ఇబ్బందులు వచ్చిపడ్డాయి. ఇస్తామన్న డబ్బు ఇవ్వలేదని.. అధికార పార్టీలో చేరి కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుందామనుకుంటే కనీసం ఇప్పుడు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఫలితంగా కూటమి నేతల అసలు స్వభావం తమకు బాగా తెలిసి వచ్చిందని మండిపడుతున్నారు.

భారీగా ఆశలు చూపి...!

బరిలో నిలిచేందుకు అనుగుణంగా 200 మందికిపైగా నేతలను తమ వైపు తిప్పుకోవాలని కూటమి నేతలు ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. తోచిన హామీ ఇచ్చి అడిగినంత నగదు ముట్టచెబుదామంటూ వరాల వర్షం కురిపించారు. పార్టీలో చేరిన తర్వాత కాంట్రాక్టులు ఇప్పిస్తామని కూడా పేర్కొన్నారు. ఈ మాయ మాటలను నమ్మిన కొద్దిమంది ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నుంచి కూటమి పార్టీల్లో చేరారు. ఎన్నికలు ముగిసి కూటమి అభ్యర్థి గెలిచిన వెంటనే హామీ ఇచ్చిన మేరకు నగదు ముట్టచెబుదామని పేర్కొన్నారు. అయితే, చేరికలు అనుకున్న మేరకు లేకపోవడం, ఓటమి ఖాయమని తెలిసి బరిలో నిలిచేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. దీంతో అప్పటివరకు ఆశలు చూపిన కూటమి నేతలు ఒక్క హామీని నెరవేర్చకుండా జారుకున్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న తమ పార్టీ నేతలు... మీ చేరికలను అంగీకరించడం లేదని మెలిక పెట్టడం ప్రారంభించారు. అందువల్ల పార్టీలో కూడా చేర్చుకోలేమని స్పష్టం చేశారు. ఫలితంగా కొద్దిమంది నేతలు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరుతుండగా.. మరికొందరు నేతలు ముఖం చెల్లక తిరిగి వచ్చేందుకు జంకుతున్నారు. మొత్తంగా తమ పరిస్థితి ఓడ మల్లన్న... బోడి మల్లన్నగా మారిందంటూ వాపోతున్నారు.

బరిలో నిలుద్దామని...

విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 830 ఓట్లు కాగా.. అందులో 615 ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. మిగిలిన 215 ఓట్లు మాత్రమే కూటమికి చెందినవి.. అయినప్పటికీ ఎన్నికల్లో నిలిచి ప్రలోభాలతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కొనుగోలు చేద్దామని భావించారు. ఇందుకు అనుగుణంగా ఎక్కడికక్కడ సమావేశాలను కూడా నిర్వహించారు. అయితే వైఎస్సార్‌సీపీ ఒక అడుగు ముందుకు వేసి.. బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు కూటమి నుంచి ఎవరిని బరిలో నిలుపుదామనే విషయంలోనే ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. మొదట్లో గండి బాబ్జీ, పీలా గోవింద్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. తీరా బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత వీరిద్దరూ పోటీలో ఉండలేమని తేల్చిచెప్పారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలతో నేరుగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు మెజార్టీ నేతలు హాజరయ్యారు. కూటమి నేతలు భారీగా ప్రలోభాలు చూపుతూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను తమవైపు లాగేందుకు ప్రయత్నించారు. కొద్దిమంది ప్రలోభాలకు లొంగి అటువైపు చేరారు. అయినప్పటికీ ఆశించినస్థాయిలో చేరికలు లేకపోవడం వంటి పరిస్థితులల్లో బరిలో నిలిచేందుకు కూటమి నేతలు ఒక్కొక్కరు వెనుకడుగు వేశారు. చివరికి దిలీప్ చక్రవర్తి పేరును మంత్రి లోకేష్ తెరమీదకు తెచ్చారు. అయితే పోటీ చేయవద్దని కోరుతూ దిలీప్ చక్రవర్తి వ్యాపార భాగస్వామి, ఎమ్మెల్సీతో మాజీ మంత్రి ఒకరు గట్టిగా చెప్పించారు. అనవసరంగా బరిలో నిలిచి జేబు ఖాళీ చేసుకోవద్దంటూ సలహా ఇచ్చారు. ఫలితంగా ఆయన కూడా పోటీకి వెనుకడుగు వేశారు. పైకి మాత్రం విలువలు, విశ్వసనీయత అని చెప్పి పోటీలో నిలవడం లేదని చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రకటనలతో అప్పటి వరకు భారీగా ప్రలోభాలు ప్రకటించిన కూటమి నేతలు పార్టీలో చేరిన నేతలను పట్టించుకోవడం మానేశారు.

అనితర సాధ్యుడు బొత్స

ప్రజాబలమున్న నాయకుడు.. ఉత్తరాంధ్రకు ఆప్తుడు.. రాజకీయాల్లో ఎన్నో ఢక్కాముక్కీలు తిన్న విజయనగరం పెద్దాయన.. ఆయనెవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందరూ అభిమానించే బొత్స సత్యనారాయణ. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ వ్యూహాలు, బొత్స సత్యనారాయణ స్థాయి ముందు కూటమి ఎత్తుగడలు ఫలించలేదు. శతవిధాలా కూటమి నేతలు ప్రయత్నించినప్పటికీ బొత్స బలం ముందు ఎవరూ పోటీ చేయడానికి సాహసం చేయలేకపోయారు. దీంతో బొత్స.. ఎదురన్నదే లేకుండా ఎమ్మెల్సీగా గెలుపొందారు.

- అందరికీ ఆమోదం.. అందుకే ఏకగ్రీవం
- బొత్స రాజకీయ చతురత ముందు నిలవలేని కూటమి కుయుక్తులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవ ఎన్నిక

సాక్షి, విశాఖపట్నం: విద్యార్థి దశ నుంచే తోటి విద్యార్థులకు సహాయం చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వంటి నాయకత్వ లక్షణాలు అలవరుచుకున్న బొత్స అంచెలంచెలుగా.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా అనేక పదవులు చేపట్టారు. తన రాజకీయ చరిత్రలో అందరివాడుగా నిలిచారనే చెప్పుకోవచ్చు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స వ్యూహం ముందు కూటమి పార్టీలే డీలా పడ్డాయి. వైఎస్సార్‌సీపీకి స్థానిక సంస్థల ఓటర్ల బలముంది. దీంతోపాటు ఎన్నికల నిర్వహణ నైపుణ్యం కలిగిన బొత్సను బరిలోకి దించడంతో ఆయనకు దీటైన పోటీ కోసం కూటమి ప్రభుత్వం గట్టి కసరత్తు చేసింది. కానీ బొత్స వ్యూహం ముందు కూటమి ప్రణాళికలు చిన్నబోయాయి. బలం లేకున్నా ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయాలని కూటమి నేతలు కుయుక్తుల పన్నినా.. వారి పన్నాగాలు ఫలించలేదు. ఆ స్థానానికి మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ ఉల్లా నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ జోరు చూసి కూటమి వెనక్కి తగ్గింది. బొత్సపై అభిమానంతో వేసిన ఒక్క నామినేషన్‌ను కూడా ఈ నెల 14వ తేదీన ఉపసంహరించుకున్నారు. దీంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవమైంది.



వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ

బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ. అప్పుడు మహానేత వైఎస్సార్‌తో సన్నిహితంగా మెలిగిన బొత్స.. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కూడా అంతే సన్నిహితంగా ఉంటున్నారు. మహానేత వైఎస్సార్ కేబినెట్‌లో ఉత్తరాంధ్ర ప్రాంత వెనకబడిన వర్గాలకు చెందిన బొత్సకు అప్పట్లో కీలక మంత్రి పదవి కేటాయించారు. మళ్లీ అదే తరహాలో 2019–24లో ఐదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో కూడా కీలక మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రగతికి యాక్షన్ ప్లాన్

- వికసిత్ భారత్‌లో భాగంగా రూపొందించండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: వికసిత్ భారత్‌లో భాగంగా 'వికసిత్ ఆంధ్ర 2047'కు సంబంధించి 2024–29 జిల్లా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆధునాతన పద్ధతులను వినియోగించడం ద్వారా అభివృద్ధితో పాటు ఉత్పత్తులను పెంచవచ్చని, తద్వారా ఆర్థిక పురోగతి సాధించవచ్చన్నారు. జిల్లా యాక్షన్ ప్లాన్ 2024–29 తయారీలో అధికారులు విజన్‌తో పనిచేయాలన్నారు. డాక్యుమెంట్స్ తయారు చేసి ముఖ్య ప్రణాళిక అధికారి నిర్దిత సమయంలో సమర్పించాలన్నారు. యాక్షన్ ప్లాన్ అంశాలపై పలు సూచనలు చేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా ముఖచిత్రంపై ప్లానింగ్ అధికారి జి.రామారావు అవగాహన కలిగించారు.

విజిబుల్ పోలీసింగ్.. కేసుల సత్వర పరిష్కారం

- సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం
- పాయకరావుపేట స్టేషన్ ఆకస్మిక తనిఖీ



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ దీపిక

పాయకరావుపేట: పట్టణ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు.. ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకొని పరిష్కార దిశగా సహకరించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీ కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల నిరోధానికి ఆకస్మిక డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తరచు రిపోర్టు అవుతున్న నేరాల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్ పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుపుకుని తగు సూచనలు ఇచ్చారు. రౌడీ షీటర్స్, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నర్సీపట్నం ఇన్‌చార్జి సబ్ డివిజన్ డీఎస్పీ బి.అప్పారావు, పాయకరావుపేట ఇన్‌స్పెక్టర్ పి.అప్పలరాజు, ఎస్సై బి.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మోక్షలక్ష్మిగా అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మ



అనకాపల్లి సత్యనారాయణపురంలో కనకదుర్గమ్మ

శ్రావణలక్ష్మీ.. నమోస్తుతే!

సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణతో జిల్లా మార్మోగింది. పవిత్రమైన రోజున వేలాది మంది భక్తులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి, తల్లి ఆశీర్వాదం పొందారు. ఇళ్లల్లో అమ్మవారిని అందంగా అలంకరించి, బంగారు కానులతో పూజించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కుంకుమ పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. – అనకాపల్లి



అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ పూజలు చేస్తున్న మహిళలు

నేడే ఎస్ఎంసీ ఎన్నికలు

- ప్రత్యక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఓటింగ్
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఎన్నికల్లో జాప్యం
- ఇప్పుడు నిర్వహించేందుకు విద్యాశాఖ నిర్ణయం
- జిల్లాలో 1,406 స్కూళ్లలో ఎన్నికలకు సమయాత్తం
- స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ షెడ్యూల్ మార్పు

సాక్షి, అనకాపల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడిన స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పదవీ కాలం ఈ ఏడాది జులైతో ముగిసింది. దీంతో కొత్తగా పేరెంట్స్ కమిటీల స్థానంలో కూటమి ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు(ఎస్ఎంసీ)గా పేరు మార్చి ఆగస్టు 8న ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు చేపట్టింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా 17వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

విద్యా హక్కు చట్టం అమల్లో భాగంగా..


2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత విద్య అందించాలి. దీంతో పాటు సెక్షన్ 21 మేరకు పాఠశాలల్లో విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లోనూ ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యుల ఎన్నిక పూర్తిచేసి, 2 గంటలకు కమిటీ సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, ప్రమాణ స్వీకారం, అనంతరం మూడు గంటలకు నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

జిల్లాలో 1,404 పాఠశాలల్లో ఎన్నికలు

జిల్లాలో మొత్తం 1,404 ప్రభుత్వ, గురుకుల, మైనార్టీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో శనివారం జరిగే ఎన్నికల్లో ఒక్కో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల్లో ముగ్గురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండేళ్ల పాటు ఈ కమిటీ మనుగడలో ఉంటుంది. కమిటీలోని సభ్యుల పిల్లలు రెండేళ్లలోపు స్కూల్ నుంచి బయటకు వెళ్లిపోతే తిరిగి ఆయా పదవులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

ఎన్నికల నియమ నిబంధనలు

- స్కూల్లో ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరు కావాలి.
- ఎన్నికలు సాధారణంగా చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో మద్దతు తెలపడం ద్వారా నిర్వహిస్తారు.
- అపరిష్కృత వివాదాలు, అసాధారణ పరిస్థితుల్లో, రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబిస్తారు.
- విద్యార్థి తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు.
- ఒక్కొక్క తరగతి నుంచి ముగ్గురు సభ్యుల్ని ఎన్నుకోవాలి.
- వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. కనీసం ఒక మహిళా సభ్యురాలు ఉండాలి.
- ఎన్నికల్లో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండరాదు. ఎన్నికల ప్రక్రియలో ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయి.



కశింకోట హైస్కూల్లో ఎస్ఎంసీ ఎన్నిక షెడ్యూల్‌ను నోటీసు బోర్డులో అతికిస్తున్న టీచర్లు (ఫైల్)

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

అనకాపల్లి: జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే పాఠశాలల వద్ద అవాంఛనీయ సంఘనలు జరగకుండా ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాలతో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని, ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు రీషెడ్యూల్ చేసి, కొత్త తేదీలు ప్రకటించామని చెప్పారు. ఈ నెల 19న 50 శాతం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, తెలుగు, గణితం, బయాలజీ ఉపాధ్యాయులు, మిగిలిన 50 శాతం ప్రాథమిక పాఠశాలల టీచర్లతోపాటు హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, సోషల్ ఉపాధ్యాయులు, 21న ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు మాత్రమే స్కూల్ కాంప్లెక్స్ ఉంటుందన్నారు. మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ఈ షెడ్యూల్‌ను తప్పని సరిగా అమలు చేయాలన్నారు. ఆ మూడురోజులు కాంప్లెక్స్ సమావేశాలు, అజెండా, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అంబులెన్స్ మీద ఫొటో మార్చడం పొరపాటే..



ఎంపీ సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నిధులతో.. అనే అక్షరాలను మూసేసి ఆమె ఫొటోపై సీఎం రమేష్ బొమ్మ చిత్రించిన దృశ్యం (ఇన్‌సెట్) అంబులెన్స్‌పై మళ్లీ ప్రత్యక్షమైన మాజీ ఎంపీ సత్యవతి చిత్రం..

- ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన వాహనం
- మాజీ ఎంపీ సత్యవతి ఫొటో తొలగించి కూటమి నేతల చిత్రాలు
- సాక్షి కథనంతో తప్పు సరిదిద్దుకున్న ఎన్టీఆర్ ఆస్పత్రి అధికారులు

సాక్షి, అనకాపల్లి: సాక్షి కథనానికి ఎన్టీఆర్ వైద్యాలయం అధికారులు స్పందించారు. తప్పు సరిదిద్దుకున్నారు. జరిగిన దానికి విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.వి.సత్యవతి ఎంపీగా ఉండగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల (ఎంపీ ల్యాడ్స్) నుంచి రూ.27 లక్షలు వెచ్చించి ఆస్పత్రికి అంబులెన్స్ సమకూర్చారు. ఇది అధికారికంగా జరిగిన చర్య. ఎప్పటికీ శిలాశాసనంగా నిలవాల్సిన విషయం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంబులెన్స్‌పై డాక్టర్ సత్యవతి ఫొటో తొలగించి, ఆ స్థానంలో ప్రస్తుత ఎంపీ రమేష్ ఫొటోను అతికించారు. ఆమె ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన వాహనం అని రాసిన విషయాన్ని మూసివేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఫొటోలు కూడా ముద్రించారు. ఈ వైనాన్ని సాక్షి దినపత్రిక 15వ తేదీ సంచికలో 'చూడు చూడు నీడలు.. సామాన్యుల బాధలు' శీర్షికన ప్రచురించిన కథనంలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. 'సొమ్మొకరిది.. సోకొకరిది' ఉప శీర్షికతో ఈ వైనాన్ని వివరించడంతో ఆస్పత్రి అధికారులు స్పందించారు. అంబులెన్స్‌పై ఉన్న కూటమి పార్టీలకు చెందిన నేతల పేర్లు, ఫొటోలు తొలగించారు. యథావిధిగా అప్పటి అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ఫొటో వేశారు. అంబులెన్స్ మీద ఫొటో మార్చడం పొరపాటే అంటూ ఆస్పత్రి అధికారులు 'సాక్షి'కి వివరణ ఇచ్చారు.

అప్పన్న సన్నిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కమ్‌టాక్స్ చీఫ్ కమిషనర్ మిటాలి మధుస్మిత దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆమెకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు. సింహాచలేశుని సన్నిధిలో ఎంతో ప్రశాంతంగా ఉందని మధుస్మిత చెప్పారు.

నేడు వైద్య సేవలు బంద్

- జూనియర్ డాక్టర్ హంతకులను శిక్షించాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర

-8లో

ఉత్తమ నాటికగా 'మూల్యం'

- ముగిసిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

-8లో

క్లుప్తంగా

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు



పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పాలిటెక్నిక్ డిప్లొమా ద్వారా విద్యార్థులు త్వరగా స్థిరపడుతున్నారని, ప్రభుత్వం డిప్లొమా కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. కళాశాలలో తరగతి గదులను, ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఐవోటీ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు నేర్పుతున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు.

కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలతో సాదరస్వాగతం పలికి కళాశాల అభివృద్ధి గురించి పలు అంశాలను ప్రస్తావించారు. జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-24లో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి లంక చైతన్య శుక్రవారం స్థానిక కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సమగ్ర శిక్షలో గత 12 ఏళ్లుగా బీఈడీ, టెట్ పరీక్షలు పాసై చాలీ చాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని వీరు ప్రభుత్వాన్ని కోరారు.

ఈ -కామర్స్ ఉద్యోగిపై కేసు నమోదు

అనకాపల్లి: ఈ- కామర్స్ కంపెనీలో పనిచేస్తున్న అనకాపల్లి మండలం కొత్తూరుకు చెందిన సీహెచ్ లక్ష్మణరావుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ వివరాల మేరకు... పట్టణంలో పలు ప్రాంతాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు ఈ- కామర్స్‌లో ఏడు సెల్‌ఫోన్లు, ఒక పర్స్‌కు బుక్ చేసుకున్నారు. వీటి కోసం రూ.93 వేలు చెల్లించినప్పటికి సేల్స్‌మెన్ లక్ష్మణరావు వస్తువులు రాలేదని వారిని దఫదఫాలుగా మోసం చేశాడు. ఈ విషయమై కొత్తూరులో ఈ- కామర్స్ కంపెనీ పాయింట్ మేనేజర్ షేక్ హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లగా, లక్ష్మణరావుపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు వైద్య సేవలు బంద్

- జూనియర్ డాక్టర్ హంతకులను శిక్షించాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర

మహారాణిపేట(విశాఖ): కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి.. హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం దేశవ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేయాలని ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నిర్ణయించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. జగదాంబ జంక్షన్‌లోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే .. ఏ విధంగా పని చేస్తామని ప్రశ్నించారు. 36 గంటలపాటు విధి నిర్వహణలో ఉండి.. సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటుంటే ఆమెపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయాలన్నారు. జూనియర్ వైద్యులు చేస్తున్న పోరాటానికి ఐఎంఏ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. వైద్యులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ కేసులు తప్పించి.. మిగిలిన అన్ని ఓపీ సేవలను బంద్ చేస్తున్నామని.. తమ ఆందోళనకు ప్రజా సంఘాలు మద్దతివ్వాలని కోరారు. ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి నాయుడు, ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) అధ్యక్షుడు డాక్టర్ వి.సురేష్, ఐఎంఏ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపడతామని జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. ఐఎంఏ ప్రతినిధులు అవినాష్, వై.ఎల్.ఎన్.రావు, కిరణ్మయి, ప్రశాంత్, ప్రణీత, ధరణి పాల్గొన్నారు.

ముగిసిన 'ఏసీఏ' నామినేషన్ల పర్వం



నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు



నామినేషన్లకు ముందు సమావేశమైన ప్యానెల్ సభ్యులు

- ఆరు పదవులకు ఆరుగురే దరఖాస్తు
- 8న నూతన కార్యవర్గం అధికారిక ప్రకటన

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల ఘట్టం ముగిసింది. ప్రస్తుత కార్యవర్గానికి చెందిన ఆరుగురు సభ్యులు రాజీనామాలతో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. వైఎస్సార్ స్టేడియంలోని ఏసీఏ కార్యాలయంలో శుక్రవారం ఆరు పదవులకు ఒకే ప్యానల్‌కు చెందిన అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 8న ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా.. ఒక పదవికి ఒకే దరఖాస్తు రావడంతో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే ఆ రోజున అధికారికంగా కార్యవర్గాన్ని ప్రకటిస్తారు. తొలుత వీడీసీఏ కార్యాలయంలో ప్యానెల్ తరపున పాల్గొనే అభ్యర్థులు సమావేశయ్యారు. 11 గంటలకు ఎన్నికల అధికారికి నామినేషన్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శిగా సేవలందించిన ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు. విశాఖ నుంచి వీడీసీఏ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ సమర్పించారు. అధ్యక్షుడిగా కేశినేని నాని, కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శ్రీనివాస్ ప్యానల్ తరపున నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే ఎన్నిక ప్రక్రియలో పాల్గొనే 34 మంది క్లబ్ ప్రతినిధుల జాబితాను ఎన్నికల అధికారికి సమర్పించగా.. ఆక్షేపణలను ఆహ్వానించిన అనంతరం నామినేషన్లను స్వీకరించారు. నూతన కార్యవర్గం 2025 వరకు ఏసీఏ కార్యక్రమాలను పర్యవేక్షించనుంది. ఎన్నిక ప్రక్రియ పూర్తయిన అనంతరం వార్షిక సమావేశం జరగనుంది.

కోడ్ ఉల్లంఘనకు స్పందించిన అధికారులు



మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం



కె.జె.పురం కళావేదిక మీద తొలగించిన కూటమి నాయకుల డిజిటల్ బోర్డు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి పి.శివ, ఇతర సిబ్బంది స్పందించారు. ఈ మేరకు ఇక్కడ కళా వేదిక మీద ఏర్పాటు చేసిన కూటమి నాయకుల డిజిటల్ బోర్డుతోపాటు గ్రామంలో పలు చోట్ల జనసేన, బీజేపీ నాయకుల డిజిటల్ బోర్డులను తొలగించారు. మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల గ్రామాల్లో రాజకీయ నాయకులు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో కాశీప్రసాదరావు ఆదేశించారు.

హైడ్రో పవర్ ప్లాంట్‌తో జలాశయాలకు ముప్పు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



వెంకన్న

దేవరాపల్లి: అనంతగిరి మండలం సరియా జలపాతానికి ఆనుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మిస్తే రైవాడ, కోనాం జలాశయాలకు ముప్పు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ దేవరాపల్లి మండలం రైవాడ, చీడికాడ మండలం కోనాం జలాశయాల ఆయకట్టు ఎడారిగా మారడం ఖాయమని స్పష్టం చేశారు. అదానీ చేతుల్లోకి అడవులన్నీ వెళ్లిపోతున్నాయని, గిరిజన బతుకులు బుగ్గిపాలు కావడంతోపాటు వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలగనుందన్నారు. అదానీ కంపెనీ ప్రతినిధులు, ఫారెస్టు అధికారులు ఈ ప్రాంతంలో రహస్య సర్వే చేయడాన్ని గిరిజనులు అడ్డగించి పంపించేశారన్నారు. అయితే జలాశయాల కింద ఆయకట్టు రైతులు మాత్రం పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. ఇప్పటికైనా ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. హైడ్రో ప్రాజెక్టుతో దేవరాపల్లి మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలోని సగం మేర గ్రామాలు, అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని సరియా, మాద్రేబు, మాకనాబిల్లి, దాయిర్తి గ్రామాలకు నష్టం వాటిల్లనుందన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ నాటికగా 'మూల్యం'

- ముగిసిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన మూల్యం నాటికలో సన్నివేశం

మునగపాక: తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ వారి మూల్యం నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. మునగపాక గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల్లో భాగంగా నందీశ్వర తులసీ కళావేదికపై ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురువారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్‌వారి రాత నాటిక నిలిచింది. ఉత్తమ రచనగా మూల్యం నాటిక, ఉత్తమ నటునిగా విశాఖకు చెందిన తెలుగు కళాసమితి వారి నిశ్శబ్దమా...నీ ఖరీదెంత నాటిక దక్కించుకుంది. ఉత్తమ నటిగా మూల్యం నాటికలోని భీశెట్టి జ్యోతీరాజ్ నిలిచింది. ఉత్తమ దర్శకునిగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్‌వారి రాత నాటికకు, ఉత్తమ హాస్యనటునిగా గణేష్ ఆర్ట్స్ థియేటర్ గుంటూరు వారి తొక్క తీశారు నాటికకు దక్కింది. ఉత్తమ ప్రతి నాయకునిగా విశాఖకు చెందిన గణేష్ ఆర్ట్స్ థియేటర్ వారి నిశ్శబ్దమా..నీ ఖరీదెంత నాటిక దక్కించుకుంది. ప్రత్యేక బహుమతి కింద శిథిలజీవి నాటిక ఎంపికైంది. విజేతలకు యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ఆహ్వాన నాటిక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వేగి సూర్యనారాయణ, ఆళ్ల జనార్దనరావు వ్యవహరించారు. నాటిక పోటీల ముగింపు కార్యక్రమానికి కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సందేశాత్మక నాటికలు రావాలి: ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సమాజానికి మంచి సందేశాన్నిచ్చే నాటికలు రావాల్సిన అవసరం ఉందని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. అంతరించుకుపోతున్న నాటక రంగానికి మునగపాక జీవం పోస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న యువజన మందిరం సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. నాటక కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. తనకు కూడా కళలంటే ఆసక్తి అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కళామతల్లికి ముద్దుబిడ్డగా మునగపాకకు గుర్తింపు ఉందన్నారు. ఏటా పరిషత్‌లు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న యువజన మందిరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

యువజన మందిర ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యానాయుడు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, కూటమి నాయకులు టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు పెంటకోట విజయ్, ఆడారి సోమశేఖర్, ఆడారి సూరిబాబు, దాడి సాంబశివ, మళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16 గంటలు ఆలస్యంగా మెయిల్

తాటిచెట్లపాలెం: హౌరాలో శుక్రవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ సుమారు 16 గంటలు ఆలస్యంగా శనివారం సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరుతుంది. లింక్ రైలు ఆలస్యంగా చేరుకుంటున్నందున.. ఈ రైలు ఆలస్యంగా బయలుదేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేవీ ప్రహరీ పనుల అడ్డగింత

- వైలోవ గ్రామస్తుల ఆందోళన



నేవల్ బేస్ (ఎన్ఏవోబీ) ప్రహరీ నిర్మాణం వద్ద ఆందోళన చేపడుతున్న వైలోవ గ్రామస్తులు

రాంబిల్లి (యలమంచిలి): నేవల్ బేస్ ప్రహరీ నిర్మాణం వల్ల జీవనాధారం కోల్పోతున్నామని శుక్రవారం వైలోవ గ్రామస్తులు వాటి పనులను అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మించడం వల్ల కొండకు వెళ్లే దారి లేక పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని వాపోయారు. ఇప్పుడు పశువులను ఎక్కడ మేపుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలాలకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, సమస్యలు పరిష్కరించే వరకు నిర్మాణ పనులకు ఆపాలని కోరుతూ డీఆర్డీవో ఆధ్వర్యంలో చేస్తున్న నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి సీఐ అక్కడకు చేరుకుని గ్రామ పెద్దలతో మాట్లాడారు. శనివారం రాంబిల్లి తహసీల్దారు వచ్చి మాట్లాడే వరకు ఆందోళ చేయవద్దని సూచించారు. ఇప్పటికే పలుమార్లు విన్నవించామని, పరిష్కరించకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ జి. దేముడునాయుడు మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలపై జిల్లా అధికారులు స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్ది నారాయణరావు, చిన కలవలాపల్లి సర్పంచ్ యన్నంరెడ్డి శ్రీనివాసరావు, వైలోవ మాజీ సర్పంచ్ బద్ది నారాయణరావు, గ్రామ పెద్దలు బద్ది నర్సింగు, శ్రీను, కృష్ణ, గణేష్, సిగిరెడ్డి సురేష్, పోతు శ్రీను, కర్రి నాని పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ టూరిజం కమిటీ ఏర్పాటు

సాక్షి, అనకాపల్లి: కలెక్టర్ విజయ కృష్ణన్ చైర్మన్‌గా ఏడుగురు అఫీషియల్ మెంబర్స్, ఐదుగురు నాన్ అఫీషియల్ మెంబర్స్‌గా నూతన డీటీసీ (డిస్ట్రిక్ట్ టూరిజం కమిటీ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్ విజయ కృష్ణన్, కన్వీనర్‌గా జిల్లా పర్యాటక అధికారి ఎస్.వి.ఎస్ సుబ్బలక్ష్మి, అఫీషియల్ మెంబర్స్‌గా ఎస్పీ ఎం.దీపికపాటిల్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, డీఎఫ్‌వో అధికారి జి.లక్ష్మణ్, ఆర్కియాలజీ ఏడీ ఎస్.వెంకటరావు, ఆర్కియాలజీ సీఏ నవీన్, డీఈవో వెంకట లక్ష్మమ్మ ఉన్నారు. నాన్ అఫీషియల్ మెంబర్స్‌గా ఏటికొప్పాక గ్రామానికి చెందిన సీవీ రాజు (పద్మశ్రీ గ్రహీత), కల్యాణి అకాడమీ కరస్పాండెంట్ ఎల్.శ్రీనివాస్, ట్రావెల్ అండ్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.విజయ మోహన్, హోటలియర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.పవన్ కార్తిక్, యోగా ట్రైనర్ కె.బాబూరావు పాల్గొన్నారు.

ప్రమాద స్థాయికి రెండడుగుల దూరంలో..

- తాండవలో 376.2 అడుగుల నీటిమట్టం



నిండు కుండలా తాండవ రిజర్వాయర్

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో మరో రెండు అడుగుల నీటిమట్టం పెరిగితే ప్రమాదస్థాయి హెచ్చరికలు జారీ చేస్తామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రానికి 376.2 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి రోజుకు 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. తాండవ రిజర్వాయర్ ప్రమాదస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా 378.0 అడుగులు నీటిమట్టం వచ్చేసరికి ప్రమాదస్థాయి హెచ్చరికలు జారీ చేసి లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. వాతావరణ పరిస్థితులు, ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహాన్ని బట్టి ప్రమాద స్థాయిని గుర్తించి, తాండవ నదిలోకి స్పిల్‌వే గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు భూములకు ప్రధాన గేట్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఈనెల 19వ తేదీన ముహూర్తం ఖరారు చేశామన్నారు. ఆయకట్టుకు నీరు విడుదల చేసే సమయానికి నీటిమట్టం ప్రమాదస్థాయి దాటిపోతే మాత్రమే నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు.

సంబల్‌పూర్-ఈరోడ్ స్పెషల్ రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను మరికొంత కాలం పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ సంబల్‌పూర్‌లో బుధవారం ఉదయం 11.35 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.32 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(గురువారం) రాత్రి 9.50 గంటలకు ఈరోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను నవంబరు 27వ తేదీ వరకు పొడిగించారు. ఈరోడ్-సంబల్‌పూర్ (08312) వీక్లీ స్పెషల్ ఈరోడ్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(శనివారం) మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను నవంబరు 29వ తేదీ వరకు పొడిగించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 'కెనరా'ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో కెనరా బ్యాంక్ విశాఖ ఏజీఎం మధుసూధన్‌రెడ్డి

విశాఖ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ రూ.24 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందించింది. కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ×కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేడ్కర్ విద్యా జ్యోతి స్కాలర్‌షిప్ స్కీమ్×కింద శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విశాఖ ఏజీఎం ఎస్.మధుసూధన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. 11 ఏళ్లుగా ప్రతిభ గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ముందుంటుందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర దేశాల్లో చదువుకునే వారికి విద్యా రుణాలు అందిస్తామన్నారు. జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలతో తీరని నష్టం

- ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం కార్పొరేటర్ పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో చిన్నయ్యపాలెం గ్రామాన్ని అనుకుని సర్వే నంబర్ 104 కొండపై మైనింగ్‌కు సిద్ధపడిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు డిమాండ్ చేశారు. మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పంచాయతీలో శుక్రవారం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. వి.ఆర్.ఇన్‌ఫ్రా టెక్నాలజీ సంస్థ చేపట్టనున్న మైనింగ్ కారణంగా కుసులవాడ ఎస్సీ కాలనీ, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, ఇచ్ఛాపురం, పందలపాక, బాకూరుపాలెం, జగన్నాపురం గ్రామాలన్నీ విష ప్రభావానికి లోనవుతాయన్నారు. దుమ్ము, ధూళి కారణంగా ఐదు కిలోమీటర్ల పరిధిలో గాలి, నీరు, పంటపొలాలు నాశనం అవుతాయన్నారు. వరి, మామిడి, జీడి, కూరగాయలు, పువ్వుల పంటలు దెబ్బతింటాయన్నారు. భూగర్భ జలాలతో పాటు చుట్టూ చెరువులు పనికారాకుండా పోతాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూర్తిగా అనారోగ్యాల పాలయి కిడ్నీ, శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారన్నారు. కొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినతులు అందజేయాలన్నారు. పాదయాత్రలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకుడు శిరువూరి శ్రీనివాసవర్మ, ప్రజానాట్య మండలి ప్రతినిధి పంపాన సూర్యనారాయణ, జోగ వెంకటరావు, కొయ్య గౌరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాజ్‌పేయికి ఘన నివాళి


మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తుమ్మపాల: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు వాజ్‌పేయి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, నాయకులు కర్రి రామకృష్ణ, ఉడా రమేష్, మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో నైపుణ్యాలకు పదును


క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులతో శివ

అనకాపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు, వారిలో నైపుణ్యాలను పెంచేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ డి.శివ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు అకాడమీ ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌పై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం చదువులో నిమగ్నమైన విద్యార్థులకు క్విజ్ పోటీలు ఆటవిడుపులా ఉపయోగపడతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీఆర్ మూర్తి, కె.పవన్, ఎం.కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లి: మండలంలోని గోపాలపురంలో శనివారం ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ ఎం.దీపికలు హాజరవుతారన్నారు. గోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 172 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,640
రెండో రకం	3,410	4,410
మూడోరకం	3,150	3,410

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వరములీయవే.. వరలక్ష్మీ

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరేందుకు కుచేలుర నుంచి కుబేరుల వరకు పూజించే తల్లి శ్రీమహాలక్ష్మి. సిరుల జల్లు కురిపించే కల్పవల్లి వరలక్ష్మి. ఆ తల్లి చల్లని ఆశీస్సులు కోరుతూ శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం ఊరూవాడా నిండు నూరేళ్ల సౌభాగ్యం కోరుతూ నవ వధువులు, పండు ముత్తయిదువులు, మంచి వరుడు కావాలని కన్యలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనకాపల్లిలో ఊరూవాడా హిందూ దేవాలయాలు, ప్రతి ఇల్లూ అమ్మవారి పూజలతో కళకళలాడాయి.


ధనలక్ష్మీదేవి అలంకరణలో గవరపాలెం సంతోషిమాత అమ్మవారు


కశింకోటలోని సర్వమంగళాంబ అమ్మవారికి కదంబ పుష్పాలతో అలంకరణ


సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


కశింకోటలోని శివాలయంలో సర్వమంగళాంబకు విశేష పూజలు


కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష అలంకరణ


వెదురుపర్తిలో దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణ

- ఊరూవాడా శ్రావణ శుక్రవారం పూజలు
- ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలో ఊరూవాడా వరలక్ష్మీదేవి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. రెండవ శుక్రవారం మహిళలు తమ శక్తి మేర లక్ష్మీదేవిని పూజించారు. వ్రత పరిసమాప్తి అయ్యాక ముత్తయిదువులను పిలిచి తాంబూలందించి, వారి ఆశీస్సులు పొందారు. ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీవ్రతాన్ని హిందువులు సంప్రదాయబద్ధంగా ఆచరించడం ఆనవాయతీ. మహిళలు తమ పసుపు కుంకుమలు కలకాలం నిలవాలని, భర్త ఆయురారోగ్యాలు కోరి, వరలక్ష్మిని పూజిస్తారు. పలు ఇళ్లలో ఆషాఢం స్తబ్దతను తరిమేస్తూ కొత్త జంటలు ఆనందంగా శ్రావణలక్ష్మిని స్వాగతించారు. గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలతో సందడి వాతావరణం నెలకొంది.

నూకాంబికా నమోస్తుతే

గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్ని అమ్మవారిని పూజించారు. ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ఈ వ్రతాలను నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణమాసంలో నాలుగు శుక్రవారాలు మహిళలచే ఉచిత సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంతసించి వరమీయవే సంతోషిమాత

పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారు భక్తులకు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏటా శ్రావణమాసం రెండో శుక్రవారం అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కరుణించుమమ్మా.. కన్యకాపరమేశ్వరీ

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రావణమాసం పూజలు చేపట్టారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో..

సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు భోగపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారిని మోక్షలక్ష్మిగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో..

మండలంలోని సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు జరిపారు. ఉదయం నుంచి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు భక్తులతో సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, సభ్యుడు బోయిన రమణాజీ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కశింకోట: మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు.

- కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.
- స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను కదంబ పుష్పాలతో అలంకరించి, మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మహిళలు ఎక్కువగా పాల్గొన్నారు.
- కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.
- లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- వెదురుపర్తి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని పూలమాలలు, నిమ్మకాయలతో అలంకరించి శ్రావణ శుక్రవార పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు.
- జాతీయ రహదారి వద్దనున్న కనకదుర్గ ఆలయాన్ని భక్తులు ఎక్కువగా దర్శించుకుని, కుంకుమార్చనలు జరిపారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ


బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ శ్రేణులు, చిత్రంలో మాజీ ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను విశాఖలోని ఆయన కార్యాలయంలో అనకాపల్లి మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ శ్రేణులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

కశింకోట: ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను విశాఖలోని ఆయన నివాసంలో కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు ఉన్నారు.


ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు

ఉత్తమ సేవలకు ప్రశంసా పురస్కారం


హోంమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న డీఎస్పీ అప్పలరాజు, డీఆర్‌డీఏ ఏపీఎం చిన్నతల్లి, శంకరం గ్రామ లైన్‌మన్ బాబూరావు, విశాఖలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు లెక్కల రమణ

78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్ తదితరుల చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం చినతల్లి, డీఎస్పీ అప్పలరాజు, శంకరం గ్రామ లైన్‌మన్ బాబూరావులు ఉత్తమ సేవలకుగాను ప్రశంసా పత్రాలు పొందారు. జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు లెక్కల రమణ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా విశాఖలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రం అందుకున్నారు.
– తుమ్మపాల

107 స్కూళ్లలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నేడు

అనకాపల్లి: అనకాపల్లి పట్టణ, మండల పరిధిలోని 107 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలు శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించే ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే హాజరుకావాలన్నారు. సభ్యుల ఎన్నికల అనంతరం కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక జరుగుతుందన్నారు. సాయంత్రం ఫలితాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేదుకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

మిత్రునికి పూర్వ విద్యార్థుల సాయం


కంచిపాటి సతీష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థి మిత్రులు

కశింకోట: అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మిత్రుడికి పూర్వ విద్యార్థులు ఆసరాగా నిలిచారు. శుక్రవారం ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో 2001–02 బ్యాచ్ టెన్త్ విద్యార్థి కంచిపాటి సతీష్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న అదే బ్యాచ్ విద్యార్థులు రూ.45 వేలు సేకరించి, మిత్రునికి అందించారు. ధైర్యంగా ఉండాలని, ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామన్న భరోసానిచ్చారు. మిత్రుల ఔదార్యానికి సతీష్ ఆనందం వ్యక్తం చేశాడు.

గురుకుల పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

అనకాపల్లి: కంప్యూటర్ల సాయంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా బోధనను విద్యార్థులకు అందించి, వారి నైపుణ్యాలకు మరింత పదును పెట్టవచ్చని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు సౌకర్యార్థం శుక్రవారం 6 కంప్యూటర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.1.80 లక్షలు విలువ చేసే కంప్యూటర్లను అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వీటి సాయంతో తమ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య మరింత చేరవయిందన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రెండో దశలో మరో నాలుగు కంప్యూటర్లు అందజేయనున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో ఆర్గనైజర్లు మహేంద్ర పట్నాయక్, గోవింద్, రామరాజు, ప్రియాంక, కమల, రత్నం, నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో నూతన కంప్యూటర్లను పరిశీలిస్తున్న నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

ఆకట్టుకున్న భక్త చింతామణి పద్య నాటకం


భక్త చింతామణి నాటకంలోని సన్నివేశం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం రాత్రి దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉత్సవంలో భాగంగా రాత్రికి తిమ్మరాజుపేటలో ప్రదర్శించిన భక్త చింతామణి పద్య నాటకం అందరినీ ఆకట్టుకుంది. నాటకాన్ని దివంగత కాళ్లకూరి నారాయణరావు రచన చేయగా బి.వి.ఎ. నాయుడు దర్శకత్వం వహించారు.

కేజీబీవీకి వాటర్ ప్యూరిఫయర్ వితరణ

సబ్బవరం : స్థానిక కేజీబీవీ విద్యాలయానికి సబ్బవరంలోని సూర్య మెడికల్స్ యజమాని బాదిరెడ్డి లక్ష్మణ మంచి నీటి ఫిల్టర్ బహూకరించారు. స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు చేతుల మీదగా కేజీబీవీ ఎస్‌వో మృదులకు శుక్రవారం దీనిని అందజేశారు. దీని విలువ రూ. 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత బాదిరెడ్డి లక్ష్మణతో పాటు బాలికా విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీ ఎస్‌వోకు వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు, లక్ష్మణ

గంగాలమ్మతల్లి గుడికి విరాళం


విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అచ్చియ్యనాయుడు

మునగపాక: మండలంలోని మూలపేట గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి అవసరమయ్యే విరాళాలు విరివిగా అందుతున్నాయి.పలువురు భక్తులు అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములతున్నారు. ఈ నెల 19న ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.5,116 నగదును శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకునికి ప్రతిభా పురస్కారం

సబ్బవరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకునికి ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్‌గా ప్రతిభా పురస్కారం లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎల్. గణేష్‌కు విశ్వవిద్యాలయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించడంతో ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. దీంతో గణేష్‌ను ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ గణేష్

ఎస్‌ఎంసీ ఎన్నికలకు 144వ సెక్షన్ అమలు

మునగపాక: ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు జరిగేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ కమిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పాఠశాలల్లో, గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా, వివాదాలు రేపేందుకు ప్రయత్నించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటు హక్కు కలిగిన తల్లిదండ్రులకు మాత్రమే ఆయా స్కూళ్లలో ప్రవేశానికి అనుమతిస్తామని, ఇతరులు ఆ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల ఆవరణలోకి రావద్దని సూచించారు. రాజకీయ పార్టీల నేతలు ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు.